నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, శుక్రవారం 6 డిసెంబర్ 2024 | KHAMMAM

సర్కార్‌కు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతాం..

- మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతల అరెస్టును ఖండిస్తున్నాం
- బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం, డిసెంబర్ 5 : బీఆర్ఎస్ సీనియర్ నేతలను అరెస్ట్ చేసిన రేవంత్ ప్రభుత్వానికి ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెబుతామని ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్సీలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రశ్నించే గొంతులను అరెస్టుల ద్వారా అణచివేయాలని చూడడం అప్రజాస్వామికమని, మా పార్టీ నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న రేవంత్‌రెడ్డి నాయత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం మొదలైందన్నారు. బీఆర్ఎస్‌తో పెట్టుకుంటే రానున్న రోజుల్లో తగిన మూల్యంగా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. అక్రమ అరెస్టులను మేధావులు, ప్రజాస్వామిక శక్తులు, తెలంగాణవాదులు ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ డౌన్ డౌన్

బీఆర్ఎస్ నేతలపై కేసులు బనాయిస్తూ అక్రమంగా అరెస్టు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తదితర నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులకు నిరసనగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, ఇల్లెందు, దుమ్ముగూడెం, చర్ల మండల కేంద్రాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు.

'కాంగ్రెస్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మణుగూరులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

- హరీశ్‌రావు అక్రమ అరెస్టుకు నిరసనగా ధర్నాలు, రాస్తారోకోలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణుల నినాదాలు
- మణుగూరులో బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మణుగూరు చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

హరీశ్‌రావు అరెస్టుపై మెచ్చా ఖండన

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట రూరల్, డిసెంబర్ 5 : రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల చేత మాజీ మంత్రి హరీశ్‌రావును అక్రమంగా అరెస్టు చేయించడాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఇంటికి వెళ్లిన సమయంలో హరీశ్‌రావును అరెస్టు చేసి తీసుకెళ్లడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు అడ్డు తప్పించుకోవాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ శ్రేణులను ఎక్కడికక్కడే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అణచివేత పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఇల్లెందులో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

ఇల్లెందులో మాట్లాడుతున్న సిలివేరి సత్యనారాయణ

ఇల్లెందు, డిసెంబర్ 5 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఇల్లెందు పట్టణంలోని జగదాంబ సెంటర్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిలివేరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణ, మండల నాయకులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తరపున పోరాటం చేస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారనే విషయం తెలుసుకున్న హరీశ్‌రావు అక్కడికి వెళితే అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. రాష్ట్రంలో పోలీసు పాలన నడుస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజ్మీరా బావుసింగ్, ఆదూరి రవి, అబ్దుల్ నబి, రాచపల్లి శ్రీను, వీరస్వామి, జబ్బార్, సర్దార్, మహ్మద్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

లక్ష్మీనగరంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం, డిసెంబర్ 5 : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ.. ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్న మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన లక్ష్మీనగరంలో ప్రధాన రహదారిపై పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, కో-కన్వీనర్ జానీపాషా ఆధ్వర్యంలో నాయకులతో కలిసి గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలనగా చెప్పుకునే ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకులకు ప్రశ్నించే హక్కు లేదా.. అని మండిపడ్డారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దామెర్ల శ్రీనివాస్, జుంజూరి జయసింహ, తంతరపల్లి వెంకటేశ్వర్లు, మర్మం గంగరాజు, కుమ్మరికుంట సూర్య, కణితి లక్ష్మణ్, జిలకర గంగరాజు, వాడే కృష్ణ, మాజీ సర్పంచ్ పాడియం రామయ్య, ఉమ్మినేని నాగరాజు, మాజీ ఎంపీటీసీ మడకం రామారావు, ఉబ్బా నర్సింహారావు, తుర్రం రాజేశ్ పాల్గొన్నారు.

మణుగూరులో రాస్తారోకో

మణుగూరులో రాస్తారోకో చేస్తున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మణుగూరు టౌన్, డిసెంబర్ 5 : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు మణుగూరు పట్టణంలోని చౌరస్తాలో ఆ పార్టీ శ్రేణులు గురువారం రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ డౌన్ డౌన్, అరెస్ట్ చేసిన హరీశ్‌రావును వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోచం నరసారావు, ముత్యం బాబు, వట్టం రాంబాబు, నూకర రమేశ్, దేనికి ప్రసాద్, ముద్దంగుల కృష్ణ, బొలిశెట్టి నవీన్, రవి, రమేశ్, కుంట లక్ష్మణ్, ఎడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చర్లలో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

చర్ల మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చర్ల, డిసెంబర్ 5 : బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిల అక్రమ అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు చర్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతును నులిమే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసే క్రమంలో పలకరించేందుకు వెళ్లిన హరీశ్‌రావును అరెస్ట్ చేయడం అమానుషమన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పంజా రాజు, కాకి అనిల్, గోరంట్ల వెంకటేశ్వరరావు, కారం కన్నయ్య, విజయారావు, గాదంశెట్టి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన కంపెనీల ఇష్టారాజ్యం!

- జిల్లాలో జోరుగా మొక్కజొన్న విత్తనోత్పత్తి
- వ్యవసాయ క్షేత్రాలే ప్రయోగశాలలు..
- రైతులను మభ్యపెడుతున్న దళారులు(ఆర్గనైజర్లు)
- దిగుబడి రాకుంటే నష్టపోతున్న అన్నదాతలు
- కంపెనీలపై ప్రభుత్వ నియంత్రణ కరువు

ఎండబెట్టిన మొక్కజొన్న కంకులు (ఫైల్)

దమ్మపేట రూరల్, డిసెంబర్ 5 : మొక్కజొన్న విత్తనోత్పత్తి కంపెనీలపై ప్రభుత్వ నియంత్రణ కరువైంది. వ్యవసాయ శాఖ అధికారులు కంపెనీల కార్యకలాపాలను పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రైతు వ్యవసాయ క్షేత్రాలను ప్రయోగశాలలుగా మార్చి రూ.కోట్లు సంపాదిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో రెండు వేల దశకంలో మొక్కజొన్న విత్తనోత్పత్తి సాగు ప్రారంభమైంది. నాటినుంచి మండల ప్రధాన పంట మొక్కజొన్న విత్తనోత్పత్తి మాత్రమే. ఈ పంట అర్లీ రబీ, రబీ పంటగా సుమారు 15 వేల ఎకరాల్లో సాగవుతోంది. ఈ పంటను బహుళజాతి కంపెనీలతోపాటు కొన్ని దేశీయ కంపెనీలు స్థానిక ఆర్గనైజర్ల ద్వారా సాగు చేయిస్తున్నాయి. ఆడ, మగ విత్తనాలను వేరువేరుగా నాటించి సాగు చేయిస్తున్నారు. కొన్ని కంపెనీలు పరాగ సంపర్కం(పాలినేషన్) పూర్తయిన తరువాత మగ మొక్కజొన్న కర్రలను ధ్వంసం చేయిస్తాయి. కొన్ని కంపెనీలు మగ మొక్కజొన్న కంకులు తయారైన తరువాత వేరుగా పంటను కోసి బహిరంగ మార్కెట్లో రైతులు ప్రత్యేకంగా అమ్ముకుని ఆదాయం పొందే వెసులుబాటు కల్పిస్తున్నాయి. ఈ విధంగా పండించిన ఆడ మొక్కజొన్న కంకులను ఆయా కంపెనీల ఆర్గనైజర్ల ద్వారా వెనక్కి(బై బ్యాక్) కొనుగోలు చేసి రైతులకు 15 రోజుల నుంచి 3 నెలలలోపు చెల్లింపులు చేస్తున్నాయి.

ఫౌండేషన్ సీడ్‌పై గోప్యత...

కంపెనీలు రైతులకు ఇచ్చే ఫౌండేషన్ సీడ్ రకం బహిర్గతం కాకుండా పూర్తి గోప్యత పాటిస్తాయి. రైతులకు ఇచ్చే సీడ్ ప్యాకెట్లపై కంపెనీ పేరు ఉండదు. కేవలం బ్యాచ్ నంబరు, లాట్ నంబరు, పరిమాణం, నాటాల్సిన విస్తీర్ణం వివరాలు మాత్రమే ముద్రిస్తారు. ఫౌండేషన్ సీడ్ తయారీలు జరిగే ప్రయోగాల దుష్పరిణామాల వల్ల మొలక తక్కువగా ఉండడం, పాలినేషన్ సమస్యలతో కంకికి గింజలు పట్టకపోవడం, జన్యులోపాలు, కంకి పరిమాణం చిన్నదిగా ఉండడం వంటి సమస్యలు కోకొల్లలు. పొరుగు రైతులందరూ ఒకే రకమైన యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నా దిగుబడుల్లో మాత్రం వ్యత్యాసం వస్తుందని ప్రతి ఏటా రైతులు గగ్గోలు పెట్టడం ఈ ప్రాంతంలో సహజం. దీనికి కారణాలను పరిశోధిస్తే కంపెనీలు వేరు వేరు బ్యాచ్‌ల ఫౌండేషన్ సీడ్ రైతులకు ఇచ్చి సాగు చేయిస్తున్నారని తెలుస్తోంది. ఒక్కో బ్యాచ్ ఫౌండేషన్ సీడ్ దిగుబడి ఒక్కో రకంగా ఉంటుంది.

ఆర్అండ్‌డీ లేకుండానే...

బహుళజాతి కంపెనీలు, దేశీయంగా కొన్ని కంపెనీలకు ఆర్అండ్‌డీ(రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) లేకుండానే రైతులతో మొక్కజొన్న విత్తనోత్పత్తిని చేయిస్తున్నాయి. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటే ఫర్వాలేదు కానీ పంట సక్రమంగా పండకపోతే ఈ కంపెనీలు ఆచూకీ లేకుండా పోతున్నాయి. ఫలితంగా ఈ పంట సాగు చేసే రైతులు నష్టపోతున్నారు.

రైతుల నుంచి బాండ్లు...

విత్తనాలను నాటించే ముందు రైతుల నుంచి ఆయా కంపెనీలు నిబంధనలతో బాండ్లు తీసుకుంటాయి. రైతులకు మాత్రం కంపెనీల నుంచి ఎటువంటి బాండ్లు, ఒప్పందాలు ఉండవు.

చెల్లింపులు ఆర్గనైజర్లకే...

రైతులు పండించిన పంటకు చెల్లించే సొమ్ము ఆయా కంపెనీలు నియమించుకున్న ఆర్గనైజర్ల ఖాతాల్లోనే జమ చేస్తాయి. టన్ను మొక్కజొన్న కంకులకు కంపెనీ చెల్లించే ధర రైతులకు తెలియకుండా గోప్యత పాటిస్తారు. ఆర్గనైజర్ రైతులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం మాత్రమే రైతులకు చెల్లిస్తాడు. దీనిని బట్టి కంపెనీ చెల్లించే ధరకు, ఆర్గనైజర్ చెల్లించే ధరకు వ్యత్యాసం ఉన్నట్లు తేటతెల్లమవుతున్నది. ప్రయోగాత్మక రకం సీడ్ ఇచ్చినప్పుడు పంట దిగుబడులు రాకపోతే రైతులు ఆందోళనలు చేయకుండా ఎంతో కొంత ఇవ్వడం ఆర్గనైజర్లకు పరిపాటిగా మారింది.

కోట్లకు పడగలెత్తుతున్న ఆర్గనైజర్లు...

మొక్కజొన్న విత్తనోత్పత్తి ఆర్గనైజర్ వ్యాపారం లాభాసాటిగా ఉందని రైతుల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తవచ్చని చెబుతున్నారు. విత్తనాల ప్రాసెసింగ్‌లో భాగమైన డ్రైయర్ యూనిట్‌లు సైతం కొంతమంది ఆర్గనైజర్లు సొంతంగా ఏర్పాటు చేసుకున్నారు. రైతులు పండించిన కొన్ని పేరుగాంచిన కంపెనీల విత్తనాలను ఆ కంపెనీలకు ఇవ్వకుండా ఎక్కువ ధరకు ఇతర వ్యాపారులకు కొంతమంది ఆర్గనైజర్లు అమ్ముకుని అధిక లాభాలు అర్జిస్తున్నారు. మొత్తానికి ఆరుగాలం కష్టించిన రైతుల ఆదాయం గోరంత.. ఆర్గనైజర్లు, కంపెనీల ఆదాయం కొండంత అన్నట్లుగా ఉంది.

పట్టించుకోని అధికారులు..

విత్తనోత్పత్తిపై వ్యవసాయ శాఖ అధికారులకు ఎటువంటి నియంత్రణ, పర్యవేక్షణ అధికారాలు లేవు. వీరు కేవలం పంట నమోదు కార్యక్రమానికే పరిమితం. రైతులను కంపెనీలు మోసగిస్తే సాధారణ ఛీటింగ్ కేసు మినహా ఎటువంటి చర్యలు ఉండవు. ఎందుకంటే రైతుల నుంచి తీసుకుంటున్న బాండ్లల్లో కంపెనీలు తమకు అనుకూలంగా అన్నింటికీ రైతులను బద్దులు చేస్తున్నాయి. ఈ విషయమై ఏవో చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా విత్తనోత్పత్తి చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకునేందుకు తమకు ఎటువంటి అధికారాలు లేవని స్పష్టం చేశారు.

ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన

- అక్రమ అరెస్టులతో ప్రశ్నించే వారిని భయపెట్టలేరు
- ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు
- ఎర్రుపాలెంలో గురుకుల సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజును అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఎర్రుపాలెం, డిసెంబర్ 5 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్నది ప్రజా పాలన కాదని.. రాక్షస పాలన అని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు మండిపడ్డారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం సందర్శించేందుకు స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్తుండగా.. అధికారుల అనుమతి లేకుండా వెళ్లొద్దని అడ్డుకున్న పోలీసులు కమల్‌రాజుతోపాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పలువురు నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారు మాట్లాడారు. రాష్ట్రంలో 400 ఉన్న గురుకుల పాఠశాలలను వెయ్యికి పెంచిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో వాటి పరిస్థితి అధ్వానంగా మారిందని ఆరోపించారు. ఫుడ్ పాయిజన్ తదితర కారణాలతో ఇప్పటివరకు 50 మంది విద్యార్థులు మృతిచెందడం బాధాకరమన్నారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులపై అధ్యయనం చేయాలనే మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో.. ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పిలుపులో భాగంగా ఇక్కడికి వస్తే అనుమతి లేదని అడ్డుకోవడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో నిర్బంధ, అక్రమ కేసులతో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. డిప్యూటీ సీఎం ఇలాకాలో ప్రతిపక్షాన్ని అణచివేసే కుట్రలో భాగంగానే తమను అడ్డుకున్నారని ఆరోపించారు. గురుకుల విద్యార్థుల సమస్యలతోపాటు అన్ని సమస్యలపై కేసీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ ప్రజాక్షేత్రంలో ఎండగడుతామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, నాయకులు రామకోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారావు, భాస్కర్‌రావు, తిరుపతిరావు, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చిన్నబాబు, కిశోర్‌బాబు, పుల్లారెడ్డి, ప్రకాశ్, దేవరకొండ రవి, పవన్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, కృష్ణ, బాలరాజు, ఇస్మాయిల్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సాధనలో భాస్కర్ పాత్రను మరువలేం..

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా
- తెలంగాణ ఉద్యమకారుడు భాస్కర్‌కు కన్నీటి వీడ్కోలు

కొత్తగూడెంలో తెలంగాణ ఉద్యమకారుడు మోరె భాస్కర్‌రావు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ వద్దిరాజు, రేగా, వనమా

రామవరం, డిసెంబర్ 5 : తెలంగాణ రాష్ట్ర సాధనలో మలిదశ ఉద్యమకారుడు మోరె భాస్కర్‌రావు పాత్ర మరువలేనిదని, ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని రామవరంలో తెలంగాణ ఉద్యమకారుడు భాస్కర్ మరణవార్త తెలుసుకున్న ఆయన ఢిల్లీ నుంచి గురువారం నేరుగా భాస్కర్ స్వగృహానికి చేరుకున్నారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, దిండిగల రాజేందర్‌లు భాస్కర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో ఎంపీ వద్దిరాజు, రేగా మాట్లాడుతూ భాస్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన దీక్షా దివస్‌ను విజయవంతం చేయడంలో భాస్కర్ కృషి, పాత్ర మరువలేనిదన్నారు. అనంతరం పార్టీ ఆఫీస్ నుంచి బయల్దేరిన భాస్కర్ అంతిమ యాత్రలో ఎంపీ వద్దిరాజు, రేగా కాంతారావు, నాయకులు పాడె మోసి కన్నీటి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సాబీర్‌పాషా, కోనేరు సత్యనారాయణ, బీజేపీ నుంచి రంగా కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఎంపీ వద్దిరాజు ఫోన్ ద్వారా మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలు భాస్కర్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. అనివార్య కారణాలతో తాము రాలేకపోతున్నామని, మీరు అధైర్యపడొద్దని, మీకు అండగా పార్టీ ఎల్లప్పుడు ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఉద్యమ భాస్కరుడు..

తెలంగాణోద్యమంలో అలుపెరుగని పోరాటం

స్థానికంగా గ్రౌండ్ ఏర్పాటులో ఆయన పాత్ర కీలకం

మోరె భాస్కర్‌రావు (ఫైల్)

రామవరం, డిసెంబర్ 5 : టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి రాష్ట్ర సాధనే ధ్యేయంగా కంకణం కట్టుకున్నారు. తెలంగాణ కోసం అలుపెరుగని పోరాటం చేశారు.. పలుమార్లు జైలు జీవితం గడిపారు కొత్తగూడెం పట్టణంలోని రామవరానికి చెందిన మోరె భాస్కర్‌రావు. ఒకానొక సందర్భంలో రాష్ట్ర సాధన కోసం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే క్రమంలో పలువురు ఉద్యమకారులు అడ్డుకున్నారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయి తెలంగాణ వస్తేనే మన బతుకులు బాగుపడుతాయని విస్తృతంగా ప్రచారం చేశారు. రామవరం ప్రాంతంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టడమే కాకుండా ఈ ప్రాంతంలో ఉన్న సాధన గ్రౌండ్‌ను కొందరు వ్యక్తులు ప్లాట్లు చేసి విక్రయించే ప్రయత్నం చేస్తుండగా.. వారి ఎత్తులను చిత్తు చేశారు. గ్రౌండ్ ఏర్పాటులో ఆయన పాత్ర మరువలేనిదని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. ఈ మైదానానికి ఆయన పేరు పెట్టాలని తీర్మానం కూడా చేశారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ సభ్యుడిగా, టీఆర్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, టీఆర్ఎస్ కొత్తగూడెం పట్టణ పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి జలగం వెంకట్రావు గెలుపునకు ఎనలేని కృషి చేశారు. రామవరం 9వ వార్డులో ఎంబీఆర్ యూత్ ఆధ్వర్యంలో అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు కూడా చేపట్టారు.